



ఆకట్టుకున్న రెస్క్యూ పోటీలు

గోదావరిఖని: మెయిన్ రెస్క్యూ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన జోనల్‌స్థాయి రెస్క్యూ పోటీలు ఆకట్టుకున్నాయి. రెస్క్యూ డ్రిల్ అండ్ పరేడ్, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ పోటీలు ఆద్యంతం ఆసక్తిగా సాగాయి. సింగరేణి వ్యాప్తంగా ఆరు టీంలు పాల్గొన్నాయి. డీడీఎంఎస్‌లు న్యాయ నిర్ణేతలుగా వ్యవహించారు.

సాక్షి
పెద్దపల్లి

బుధవారం । 11 । అక్టోబర్ । 2023

న్యూస్‌రీల్

15 నుంచి సీఎం కేసీఆర్ పర్యటన

- ఉమ్మడి జిల్లా పర్యటనతో ప్రచారం మొదలు



సాక్షి ప్రతినిధి, కరీంనగర్: రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలైంది. షెడ్యూల్ విడుదలవటంతో పార్టీలన్నీ ప్రచారంపై దృష్టి సారించాయి. ఇందులో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుడిగాలి పర్యటన చేయనున్నారు. సిరిసిల్ల, మంథని, పెద్దపల్లి, హుస్నాబాద్, కోరుట్ల, పెద్దపల్లి నియోజకవర్గాల్లో జరిగే భారీ బహిరంగ సభల్లో పాల్గొని సీఎం కేసీఆర్ ప్రసంగించనున్నారు. హుస్నాబాద్ నియోజకవర్గం నుంచి ఎన్నికల శంఖారావం పూరించేందుకు గులాబీ బాస్ సిద్ధమయ్యారు. సీఎం కేసీఆర్ పాల్గొనే సభల వివరాలు:

తేదీ	సభ జరిగే నియోజకవర్గం
15 అక్టోబర్	హుస్నాబాద్
17 అక్టోబర్	సిరిసిల్ల
02 నవంబర్	ధర్మపురి
03 నవంబర్	కోరుట్ల
07 నవంబర్	మంథని, పెద్దపల్లి

న్యాయ విజ్ఞాన సదస్సు



పండ్లు పంపిణీ చేస్తున్న జడ్జి తదితరులు

పెద్దపల్లిరూరల్: స్థానిక బందారికుంట స్ఫూర్తి మానసిక దివ్యాంగుల కేంద్రంలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం జరుపుకున్నారు. ఈసందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి హేమంత్‌కుమార్, సీనియర్ సివిల్ జడ్జి అర్జున్ హాజరయ్యారు. విద్యార్థులకు పండ్లు, బిస్కట్లు పంపిణీ చేశారు. మానసిక శాంతి కోసం యోగా, వ్యాయామం నేర్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్, సభ్యులు శ్రీధర్, రమేశ్, నరేశ్, శ్రీనివాస్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక



విద్యార్థిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ దీనా

ధర్మారం: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న మారం శ్రావ్య జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ కొమురయ్య మంగళవారం తెలిపారు. కరీంనగర్‌లో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయిపోటీలు అండర్–18లో ప్రతిభ చూపిందన్నారు. ఈనెల 15 నుంచి 17వ తేదీ వరకు హన్మకొండలో జరిగే 34వ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలకు తెలంగాణ తరఫున శ్రావ్య హాజరవుతుందని పీఈటీ వివరించారు. శ్రావ్యను ప్రిన్సిపాల్ దీనా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు బైకనీ కొమురయ్య, మేకల సంజీవరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాశాలలో తనిఖీలు

ముత్తారం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంగళవారం జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి డి.కల్పన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతులు, సౌకర్యాలు, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులు పరిశుభ్రత పాటిస్తూ ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ చూపాలని చెప్పారు. ప్రిన్సిపాల్ ఎస్‌కే లాయక్‌అలీ, అధ్యాపకులు ఉన్నారు.

భద్రతా బలగాల ఉపసంహరణ

రామగుండం: పట్టణంలోని 62.5 మెగావాట్ల సామర్థ్యం గల బీ–థర్మల్ విద్యుత్ కేంద్రంలో తెలంగాణ స్టేట్ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్(టీఎస్ఎస్‌పీఎఫ్) భద్రతా బలగాలను ఉపసంహరించినట్లు సూపరింటెండెంట్ ఇంజినీర్ పి.విజేందర్ మంగళవారం తెలిపారు. 50 మందితో థర్మల్ కేంద్రంలో పహారా కాస్తున్నారు. ఈ బలగాలను ఇతర విద్యుత్ కేంద్రాలకు బదిలీ చేశారు. అయితే, జెన్‌కోలోని 15 మంది సెక్యూరిటీ ఉద్యోగులు, మరో 25 మంది ప్రైవేట్ సెక్యూరిటీ ఉద్యోగులతో భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని విద్యుత్ సౌధ నుంచి అధికారులకు ఆదేశాలు వచ్చాయి. విద్యుత్ కేంద్రంలో అంతర్గత వ్యయాలను తగ్గించుకోవడంలో భాగంగానే భద్రతా సిబ్బందిని తొలగించినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

ఒక్క చాన్స్ ఇవ్వండి..!

- ఓటర్లకు బీజేపీ, కాంగ్రెస్ నాయకుల విన్నపాలు
- విజయం కోసం బండి సంజయ్, మక్కాన్ సింగ్, ఆది శ్రీనివాస్, అడ్లూరి, కేకే ఆరాటం
- బీఆర్‌ఎస్ నుంచి చల్మెడ, కౌశిక్, సంజయ్‌లది అదే బాట..
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికర రాజకీయం



సాక్షిప్రతినిధి, కరీంనగర్: విజయం.. వేదిక ఏదైనా బరిలో ఉన్నవారితో దోబూచులాడే అనుభూతి. ఆఖరి క్షణం వరకు పోరాటం చేసినా.. ఎవరిని వరిస్తుందో తెలియని ఉత్కంఠ. అందుకే, ఓటమిని తలచుకొని బాధ పడకుండా పట్టు వదలని విక్రమార్కుడిలా చివరి వరకు పోరాడాలి అంటారు. తాజా రాజకీయ పరిస్థితుల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి పలువురు నాయకులు అసెంబ్లీకి పోటీ పడుతున్న తీరు కూడా అలాగే కనిపిస్తోంది. పలువురు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల ఎమ్మెల్యే ఆశావహులు తమను ఈసారైనా గెలిపించాలని.. ఒక్క చాన్స్ ప్లీజ్ అంటూ ప్రజల ముందుకు వస్తున్నారు. విపక్షాల మాటలు నమ్మితే మోసపోతారని, తమను తిరిగి గెలిపిస్తే అభివృద్ధి కొనసాగిస్తామని.. తమకు మరో అవకాశం ఇవ్వాలని బీఆర్‌ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, కొత్త ఆశావహులు ప్రచారం ప్రారంభించారు.

వరుస ఓటములు.. అయినా బరిలో..

ఉమ్మడి జిల్లాలో పలువురు వరుస ఓటములు ఎదురైనా ఏమాత్రం కుంగిపోకుండా విజయం కోసం బరిలో నిలుస్తూనే ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది కాంగ్రెస్ నుంచే ఉండటం గమనార్హం.

- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో ఆది శ్రీనివాస్(వేములవాడ), అడ్లూరి లక్ష్మణ్(ధర్మపురి), కేకే మహేందర్‌రెడ్డి(సిరిసిల్ల) నాలుగు సార్లు బీఆర్‌ఎస్ చేతిలో పరాజయం పాలయ్యారు. అయినా, వీరంతా ఏమాత్రం వెరవకుండా ఈసారి ఎలాగైనా గెలిచేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.
- కరీంనగర్ నుంచి 2014, 2018 ఎన్నికల్లో ఎంపీ బండి సంజయ్(బీజేపీ), పొన్నం ప్రభాకర్(కాంగ్రెస్)లు రెండుసార్లు ఓడారు. అయినా మూడోసారి బరిలో దిగి, గెలుపు రుచి చూడాలనుకుంటున్నారు.
- హుజూరాబాద్ నుంచి ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి 2018లో కాంగ్రెస్ తరఫున పోటీ చేసి, ఓడిపోయారు. ఇప్పుడు అసెంబ్లీకి తిరిగి పోటీ చేస్తున్నారు.
- మానకొండూరు నుంచి 2009లో ప్రజారాజ్యం, 2014లో టీడీపీ నుంచి పోటీ చేసి, ఓడిపోయిన కవ్వంపల్లి సత్యనారాయణ ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.
- 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ పార్టీ నుంచి రామగుండం బరిలో నిలిచిన మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌కు నిరాశ ఎదురైంది. ఈసారి కర్ణాటక ఎన్నికల ప్రభావం, ప్రభుత్వ వ్యతిరేకత అనుకూలిస్తుందని విజయంపై ధీమాగా ఉన్నారు.
- కోరుట్ల నియోజకవర్గం నుంచి 2014లో స్వతంత్ర, 2018లో కాంగ్రెస్ నుంచి జువ్వాడి నర్సింగరావు పోటీ చేసి, ఓడిపోయారు. ఇప్పుడు కూడా పోటీకి సిద్ధంగా ఉన్నారు.
- 2009లో పెద్దపల్లి నుంచి టీడీపీ అభ్యర్థిగా విజయరమణారావు గెలిచారు. తర్వాత 2014లో టీడీపీ, 2018లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినా విజయం వరించలేదు. ఈసారి ఆయన తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు.
- 2014లో, 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి పోటీ చేసిన చల్మెడ లక్ష్మీనరసింహారావు ఓడిపోయారు. ప్రస్తుతం పార్టీ మారి, బీఆర్‌ఎస్ అభ్యర్థిగా వేములవాడ నుంచి బరిలో నిలిచారు.
- మంథని నుంచి 2009లో ప్రజారాజ్యం పార్టీ తరఫున పుట్ట మధు పోటీచేసి, ఓడిపోయారు. 2014లో బీఆర్‌ఎస్ నుంచి విజయం సాధించారు. 2018లో పరాజయం పాలైనా.. ఈసారి విజయంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారు.

అభివృద్ధిపై సిట్టింగ్‌ల హామీ

మరోవైపు ఉమ్మడి జిల్లాలో 13 స్థానాలకు గానూ 11 స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులే బరిలో ఉన్నారు. వీరిలో 8 మంది సీనియర్లు కాగా.. ముగ్గురు కొత్తగా పోటీలో నిలిచారు. తమకు మరో చాన్స్ ఇస్తే.. రైతుబంధు, రైతుబీమా, దళితబంధు, కల్యాణలక్ష్మి/షాదీముబారక్, పింఛన్లు, గృహలక్ష్మి, బీసీబంధు తదితర సంక్షేమ పథకాలను యథావిధిగా అమలు చేయడంతోపాటు మరింత అభివృద్ధి చేసి చూపుతామని హామీ ఇస్తున్నారు.

- కేటీఆర్ (2009, 2010, 2014, 2018) నాలుగుసార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా సిరిసిల్లలో తన మార్క్ చూపించారు. సిరిసిల్ల నేత కార్మికుల కోసం ప్రవేశపెట్టిన పథకాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు తనను ఐదోసారి ఎమ్మెల్యే గెలిపిస్తాయని ధీమాగా ఉన్నారు.
- గంగుల కమలాకర్ 2009లో టీడీపీ, 2014, 2018లో బీఆర్‌ఎస్ నుంచి హ్యాట్రిక్ విజయం సాధించి, కరీంనగర్‌లో కొత్త రికార్డు సృష్టించారు. స్మార్ట్‌సిటీ, కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్‌ఫ్రంట్ వంటి రూ.వందల కోట్ల ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులతో మంత్రిగా నియోజకవర్గంపై తనదైన ముద్ర వేశారు. నాలుగోసారి విజయంపై కన్నేశారు.
- కొప్పుల ఈశ్వర్ 2004, 2008లో మేడారం నుంచి 2009, 2010, 2014, 2018లో ధర్మపురి నుంచి వరుసగా విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ధర్మపురి నుంచే బరిలో నిలిచారు.
- 2014, 2018 ఎన్నికల్లో వరుస విజయాలు సాధించిన ఎమ్మెల్యే రసమయి బాలకిషన్(మానకొండూరు), దాసరి మనోహర్‌రెడ్డి(పెద్దపల్లి), వొడితెల సతీశ్‌బాబు (హుస్నాబాద్) తాజా ఎన్నికల్లో గెలిచి, హ్యాట్రిక్ కొట్టాలని ఉవ్విళ్లూరుతున్నారు.
- 2018 ఎన్నికల్లో డాక్టర్ సంజయ్(జగిత్యాల), కోరుకంటి చందర్(రామగుండం), సుంకె రవిశంకర్(చొప్పదండి) గెలిచారు. రెండోసారి విజయం సాధించే ప్రయత్నాల్లో ఉన్నారు.
- ఈటల రాజేందర్ హుజూరాబాద్ నుంచి 2004, 2008, 2009, 2010, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా ఆరుసార్లు బీఆర్‌ఎస్ కారు గుర్తుపై గెలిచారు. అనూహ్యంగా పార్టీ మారి, 2021 ఉప ఎన్నికల్లో బీజేపీ నుంచి విజయం సాధించారు. ఇప్పుడు మరోసారి ఎమ్మెల్యేగా పోటీకి సిద్ధమయ్యారు.
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి జగిత్యాల నుంచి ఆరుసార్లు ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1983 టీడీపీ నుంచి శాసనసభకు వెళ్లిన ఆయన.. 1989, 1996 ఉప ఎన్నిక, 1999, 2004, 2014లో ఎమ్మెల్యేగా గెలిచారు. మరోసారి శాసనసభ ఎన్నికల్లో బరిలో నిలవనున్నారు.
- డాక్టర్ సంజయ్ కోరుట్ల, పాడి కౌశిక్‌రెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావులు కొత్తగా బీఆర్‌ఎస్ నుంచి పోటీ చేయనున్నారు. వీరిలో కౌశిక్, చల్మెడలు గతంలో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచినవారే.
- 2009, 2010 ఉప ఎన్నిక, 2014, 2018 ఎన్నికల్లో వరుసగా గెలిచిన కోరుట్ల ఎమ్మెల్యే కె.విద్యాసాగర్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు ప్రస్తుత ఎన్నికల్లో పోటీ చేయడం లేదు. రమేశ్‌బాబు మాత్రం 2009లో టీడీపీ నుంచి గెలవగా, కోరుట్ల నుంచి విద్యాసాగర్‌రావు నాలుగుసార్లు కారు గుర్తు మీదనే గెలవడం గమనార్హం.

'కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: రాష్ట్రానికి కేసీఆర్ పాలనే శ్రీరామ రక్ష అని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. మంగళవారం పలువురు బీఆర్‌ఎస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాల కొనసాగింపు కోసం కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామన్నారు. కాంగ్రెస్ నాయకత్వంపై నమ్మకాన్ని కోల్పోయిన పార్టీ నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతుంటే, అమ్ముడుపోతున్నారని ఆరోపణలు చేస్తూ అవమానిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ నాయకులు తీరుమార్చుకోకపోతే ప్రజాక్షేత్రంలో తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఆకలిచావులు, ఆత్మహత్యలు ఉండేవని, కానీ, ఇప్పుడు రాష్ట్రంలో ప్రతీ ఇంటికి సంక్షేమ పథకం అమలు అవుతోందన్నారు. దీంతో ఆకలిచావులు లేకుండా పోయాయన్నారు. వ్యవసాయ రంగానికి 24 గంటల విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రం అన్నారు. నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, అంతర్గాం జెడ్పీటీసీ అముల నారాయణ, స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆర్గనైజర్ మూల విజయారెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు చెరుకు బుచ్చిరెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు పీటీస్వామి, బొడ్డు రవీందర్, తోడేటి శంకర్‌గౌడ్, అచ్చె వేణు, మెతుకు దేవరాజ్, చిప్ప రాజేశం, కలువల సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే



పాదయాత్ర చేస్తున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, పేదల కష్టాలు తీరుతాయని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. మంగళవారం స్థానిక 32, 33, 44వ డివిజన్లలో పాదయాత్ర ద్వారా పర్యటించారు. మాయమాటలతో ప్రజలను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం తొమ్మిదేళ్ల క్రితం ఇచ్చిన హామీలైన ఇంటికో ఉద్యోగం, దళితులకు మూడు ఎకరాల పంపిణీ, డబుల్ బెడ్‌రూం ఇళ్లు, మైనారిటీలకు 12 శాతం రిజర్వేషన్ అమలు చేయడంలేదన్నారు. మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వానికి ఘోరీ కట్టాలని కోరారు. ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కాంగ్రెస్‌ను ఆదరించి రామగుండం కాంగ్రెస్ అభ్యర్థిగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎండీ ముస్తాఫా, సిరిపురం మహేశ్, మారుపాక శంకర్, ఉదయ్‌రాజ్ పాల్గొన్నారు.

ఆయనతోనే ఆమె..

- కలిసి నడిచారు.. కలిసే 'పోయారు'
- భర్తతో కలిసి భార్య ఆత్మహత్య
- అనాథలైన చిన్నారులు
- నెల్లిపల్లి గ్రామంలో విషాదం నింపిన కౌలురైతు దంపతుల ఆత్మహత్య



రోదిస్తున్న సంగీత తల్లి మధునమ్మ



కన్నీటిపర్యంతమవుతున్న అశోక్ తల్లిదండ్రులు

మంథని: పుట్టినిల్లు.. మెట్టినిల్లు రెండూ నిరుపేద కుటుంబాలే.. కూలీపని చేసుకుంటేనే పూట గడిచేది.. వరద మిగిల్చిన విషాదం ఆ రెండు కుటుంబాలను చిదిమేసింది.. భర్తకు అన్నింటా చేదోడు వాదోడుగా, ఎంతోఅన్యోన్యంగా ఉండే భార్య.. భర్త వెంటే తాను తనువు చాలించింది.. కానీ, తన ఇద్దరు చిన్నారుల భవితవ్యం గురించి ఒక్కసారైనా ఆలోచన చేయలేదు.. విషాదం నింపిన ఈ ఘటన కన్నీరు తెప్పించింది.

మంథని మండలం ఎక్లాస్‌పూర్ గ్రామపంచాయతీ పరిధి నెల్లిపల్లిలో సోమవారం రాత్రి పురుగుల మందు తాగి తనవు చాలించిన కటుకు అశోక్ (35)అంటే ఆయన భార్య సంగీత(28)కు అమితమైన ప్రేమ అని స్థానికులు అనుకుంటున్నారు. భర్తను ఎవరైనా చిన్నమాట అంటే వారించేదని, తన కూతురు, కుమారున్ని సైతం ఎంతోఅల్లారుముద్దుగా పెంచుకుందని, అలాంటి దంపతులిద్దరూ తన ఇద్దరు చిన్నారులను వదిలి కానరాని లోకాలకు వెళ్లడంపై స్థానికులు కన్నీరుమున్నీరవుతున్నారు.

రెండుసార్లు పంట మునక

గ్రామానికి చెందిన కటుకు రాయమల్లు– రమాదేవికి ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. రాయమల్లుకు ఉన్న కొద్దిపాటి భూమిని తానే సాగు చేసుకుంటున్నాడు. ఓ కుమారుడు ప్రైవేట్ బస్సు డ్రైవర్‌గా పనిచేస్తుండగా అశోక్ ఐదు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి, పత్తి సాగు చేసుకుంటున్నాడు. కాగా కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో అశోక్ సాగు చేసిన వరి, పత్తి పంటలు రెండుసార్లు నీటమునిగి పంటలు దెబ్బతిని నష్టపోయాడు. దీంతో పెట్టుబడి కోసం తెచ్చిన రూ.2లక్షల వరకు అప్పు ఎలా తీర్చేదనే మనస్తాపంతో తన భార్యతో కలిసి ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు, స్థానికులు భావిస్తున్నారు.

పిల్లల ముఖాలకు పసుపు ఎందుకు రాసినట్లు?

దంపతులిద్దరూ పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు మృతురాలి తండ్రి రామస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా వారి పిల్లలు సాయి, సన ముఖాలకు పసుపు ఉందని, అలా ఎవరు, ఎందుకు రాసి ఉంటారని పలువురు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్టర్ డ్రైవర్ పనిమానేసి.. వ్యవసాయం వైపు..

అశోక్ గతంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేసేవాడని, రెండుమార్లు ప్రమాదం నుంచి బయటపడడంతో ఆ పనిమానేసి వ్యవసాయం వైపు దృష్టి సారించినట్లు స్థానికులు తెలిపారు. కాగా అశోక్‌కు వ్యవసాయం కూడా అచ్చిరాలేదని, గతంలో కూడా మనస్తాపంతో ఆత్మహత్యాయత్నం చేసినట్లు పలువురు గ్రామస్తులు అనుకుంటున్నారు.

అనుక్షణం అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లిరూరల్: ఎలక్షన్ కమిషన్ జారీచేసిన మార్గదర్శకాలపై అధికారులు అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. రామగుండం సీపీ రెమారాజేశ్వరి, అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి మంగళవారం అధికారులకు ఎన్నికల నిర్వహణపై కలెక్టరేట్‌లో అవగాహన కల్పించారు. నిబంధనల ఉల్లంఘనపై అందే ప్రతీఫిర్యాదుకు ఆధారాలను తప్పనిసరిగా సేకరించాలన్నారు. వీడియో చిత్రీకరించి వెంటనే రిటర్నింగ్ అధికారికి సమాచారం అందించాలని అన్నారు. అభ్యర్థులు ప్రదర్శించే ప్రతీ ఫ్లెక్సీ, పోస్టర్, బ్యానర్‌ను గమనించాలని, వాటికి అయిన ఖర్చు వివరాలను సదరు అభ్యర్థి ఖాతాలో నమోదు చేయాలని సూచించారు. ఆయా ఫ్లెక్సీ, పోస్టర్లకు ఎన్నికలఖర్చు కోసం తెరచిన బ్యాంకు ఖాతా నుంచే జరిగాయా..లేదా పరిశీలించాలని చెప్పారు. ఎన్నికలు ప్రశాంతం వాతావరణంలో జరిగేలా పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి నిరంతర నిఘా ఉంచేలా ఏర్పాట్లు చేశామని సీపీ రెమారాజేశ్వరి సూచించారు.

ఎన్నికలకు సన్నద్ధం

- నాలుగు చోట్ల చెక్‌పోస్టులు
- నోడల్ అధికారుల నియామకం
- సమస్యాత్మక కేంద్రాలపై నిఘా
- అప్రమత్తమైన పోలీసులు

సాక్షి, పెద్దపల్లి: ప్రశాంత వాతావరణంలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించడానికి జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఓటింగ్ యంత్రాల పరితీరు సరిచూసుకుంటూ, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించడానికి అవసరమైన పనుల్లో జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఇప్పటికే హోర్డింగ్స్, ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్ తొలగింపజేస్తోంది.

87 సెక్టార్లుగా విభజన

- అవాంతరాలను అధిగమించేందుకు జిల్లాను 87 సెక్టార్లుగా విభజించారు.
- ఎన్నికల సంఘం ఆదేశాల అధికారులకు ఎన్నికల బాధ్యతలు అప్పగించారు.
- వీరు ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వీలుగా విభాగాల వారీగా బృందాలను ఏర్పాటు చేశారు.
- ఒక్కో బృందంలో ఇద్దరు. ముగ్గురు అధికారులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు.
- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ)ని అమలు చేసేందుకు 10 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 10 స్టాటిస్టికల్ సర్వైలెన్స్ టీం(ఎస్ఎస్‌టీ), 5 వీడియో విజిలెన్స్ (వీవీటీ), వీడియో వ్యూయింగ్ (వీవీ)టీంలను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చారు.

రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు..

ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒక ఓటరు నమోదు అధికారి(ఈఆర్‌వో) ఉంటారు. సదరు నియోజకవర్గానికి ఈఆర్‌వోగా వ్యవహరించిన అధికారినే ఎన్నికల సంఘం ఆ అసెంబ్లీ సెగ్మెంట్‌కు రిటర్నింగ్ అధికారిగా నియమిస్తుంది. జిల్లాలో మూడు అసెంబ్లీ స్థానాలు ఉండగా, పెద్దపల్లి అసెంబ్లీకి ఆర్డీవో మధుమోహన్, రామగుండానికి రిటర్నింగ్ అధికారిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ, మంథనికి ఆర్డీవో హనుమా నాయక్ విధులు నిర్వర్తించనున్నారు. వీరితోపాటు సహాయ రిటర్నింగ్ అధికారులు కూడా ఉంటారు. నియోజకవర్గంలోని తహసీల్దార్లకు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు అప్పగించారు. అంటే.. ఒక్కో నియోజకవర్గంలో సుమారు ఆరుగురు వరకు తహసీల్దార్లు ఉన్నారు. వీరందరూ సహాయ రిటర్నింగ్ అధికారులుగా వ్యవహరిస్తారని ఎన్నికల విభాగం అధికారులు పేర్కొంటున్నారు. రిటర్నింగ్ అధికారితోపాటు ఎన్నికల విధుల్లో వీరు కీలకంగా వ్యవహరించనున్నారు.

ప్రతీ సెగ్మెంట్‌కు ఫ్లయింగ్ స్క్వాడ్స్..

- ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఫ్లయింగ్ స్క్వాడ్స్‌ను ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయి.
- ఇందులో ఒక డిప్యూటీ తహసీల్దార్, ఒక పోలీస్ కానిస్టేబుల్, ఒక వీడియో లేదా ఫొటోగ్రాఫర్ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో ఈసీ స్పష్టం చేసింది.
- ఆయా బృందాలు నియోజకవర్గంలో ప్రతీకదలికను ఎన్నికల సంఘానికి చేరవేసేలా చర్యలు తీసుకుంటాయి.
- ఎక్కడ, ఎలాంటి అవాంఛనీయ ఘటన చోటుచేసుకోకుండా, పకడ్బందీగా ఎన్నికల కోడ్ అములు చేసేలా ప్రభుత్వ యంత్రంగాం ఏర్పాట్లు చేస్తోంది.

నోడల్ అధికారులు..

ఎన్నికల నిర్వహణలో కీలకమైన నోడల్ అధికారుల నియామకం పూర్తయింది. వీరి ఆధ్వర్యంలోనే ఈవీఎంల మేనేజ్‌మెంట్, శాంతిభద్రతలు, సిబ్బంది నియామకం, శిక్షణ సామగ్రి, నిర్వహణ, రవాణా, సైబర్ సెక్యూరిటీ, ఖర్చుల పరిశీలన, తపాలా బ్యాలెట్, కమ్యూనికేషన్ ప్రణాళిక, ఓటరు జాబితా, ఓటరు సహాయక కేంద్రం, పరిశీలకుల మేనేజ్‌మెంట్, సమన్వయం వంటివి ఉంటాయి.

జిల్లా సమాచారం

మొత్తం ఓటర్లు	6,94,230
పోలింగ్ కేంద్రాలు	837
సమస్యాత్మక కేంద్రాలు	68
చెక్‌పోస్టులు	04

68 సమస్యాత్మక ప్రాంతాలు..

- ఓటింగ్ శాతం తక్కువగా, డబ్బు, మద్యం ప్రభావం అధికంగా ఉండే సమస్యాత్మక ప్రాంతాలు జిల్లాలో 68 ఉన్నాయని అధికారులు గుర్తించారు. వీటిపై ప్రత్యేక దృష్టిసారించనున్నారు.
- అలాగే దుబ్బపల్లి, గుంపుల, ఎక్లాస్‌పూర్, గోదావరిఖని ప్రాంతాల్లో పోలీస్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు మొదలుపెట్టారు.
- పోలింగ్‌ను ప్రభావితం చేస్తారని అనుమానిస్తున్న నేరగాళ్లను బైండోవర్ చేస్తున్నారు.
- మరోపక్క ఆయుధాలను సరెండర్ చేసుకునేందుకు లైసెన్స్ హోల్డర్స్‌కు ఇప్పటికే పోలీసులు ఆదేశాలు ఇచ్చారు.

కలెక్టరేట్‌లో ఫిర్యాదుల విభాగం

సీ–విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా ఫిర్యాదులు స్వీకరించేలా, 24 గంటలు పనిచేసేలా ప్రత్యేక కేంద్రాన్ని కలెక్టరేట్‌లో ఏర్పాటు చేశారు. అలాగే సభలు, సమావేశాలు, ర్యాలీలు తదితర అనుమతుల కోసం సువిధ యాప్ ద్వారా సింగిల్ విండో పద్ధతిన అనుమతులు ఇవ్వనున్నారు. సదరు రాజకీయ పార్టీల ప్రతినిధులు సరైన డ్యాక్యుమెంట్లతో ఎవరు ముందుగా దరఖాస్తు చేసుకుంటే వారికి అనుమతులు ఇవ్వనున్నారు.

క్లుప్తంగా

డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి పర్యటన

ధర్మారం: డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి డాక్టర్ సామ్యూల్ మంగళవారం పలు గ్రామాల్లో పర్యటించారు. వైద్యాశాఖ పనితీరుపై ఆరా తీశారు. కొత్తూరు, ఖిలావనపర్తి గ్రామాల్లోని పల్లె దవాఖానాలు, బంజేరుపల్లి గోపాల్ రావుపేటలో ఆయన పర్యటించి టీకా వివరాలు సేకరించారు. సబ్‌సెంటర్ పరిధిలోని గ్రామాల్లో చేపట్టిన వ్యాక్సినేషన్ గురించి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులను తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ కార్డులను పరిశీలించారు. వైద్యసిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. మేడారం వైద్యాధికారి నార్ల అనుదీప్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఐక్యత చాటుదాం



మాట్లాడుతున్న ప్రభాకర్

పెద్దపల్లిరూరల్: ఉన్నత చదువులను చదివి నిస్వార్థంగా ప్రజాసేవ కోసం శాసనసభ ఎన్నికల్లో పోటీ పడుతున్న దాసరి ఉషను గెలిపించుకోవాలని పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ కోరారు. పట్టణంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెద్దపల్లి బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి దాసరి ఉషతో కలిసి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఐక్యతను చాటేందుకు పద్మశాలీలు సన్నద్ధ కావాలని కోరారు. జనాభా ప్రాతిప్రదికన 6 అసెంబ్లీ, 2 పార్లమెంట్ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి అసెంబ్లీ స్థానానికి బహుజన సమాజ్ పార్టీ తన అభ్యర్థిగా దాసరి ఉషను ప్రకటించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, సదానందం, కొండి కనకయ్య, రాజ్‌కుమార్, వెంకటేశం, పాపయ్య, గోలి శ్రీనివాస్, మిట్టపల్లి వెంకటేశం, వైకుంఠం, బండి రంగయ్య, శ్రీనివాస్, కనకయ్య పాల్గొన్నారు.

శవమై తేలిన ధర్మతేజ



ధర్మతేజ (ఫైల్)

రామగుండం: ఎన్టీపీసీకి చెందిన పలువురు యువకులు ఈనెల 8వ తేదీన బర్త్ డే పార్టీ చేసుకునేందుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు వచ్చారు. కేక్ కట్ చేసి విందు ఏర్పాటు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఐదుగురు మిత్రులు గోదావరినదిలో స్నానానికి దిగారు. ఈక్రమంలో కనకమేడల ధర్మతేజ(32) నీటిలో గల్లంతైన విషయం తెలిసిందే. 48 గంటల పాటు గోదావరినదిలో జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టగా మంగళవారం మృతదేహం లభించింది. మృతదేహానికి అక్కడే పోస్టుమార్టం నిర్వహించి మృతుడి బంధువులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్నట్లు అంతర్గాం ఎస్సై బోగె సంతోష్‌కుమార్ తెలిపారు.

నాటుసారా పట్టివేత

మంథని:నాగెపల్లి క్రాస్‌రోడ్డు నుంచి అక్రమంగా తరలుతున్న నాటుసారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య తెలిపారు. మంగళవారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా జయశంకర్ భుపాలపల్లి జిల్లా కాటారం వైపునుంచి ద్విచక్ర వాహనంపై నాటుసారా సరఫరా చేస్తున్నట్లు సమాచారం రావడంతో మాటువేసి పట్టుకున్నట్లు తెలిపారు. అడ్వాలపల్లికి చెందిన బానోతు మోహన్ నాయక్, దేవిపై కేసు నమోదు చేసి తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ వివరించారు.

సజావుగా ఎన్నికల నిర్వహణ

- ప్రజలు, రాజకీయ పార్టీల నేతలూ సహకరించండి
- నియోజకవర్గంలో 2,14,716 మంది ఓటర్లు
- మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిర్వహణకు ప్రత్యేక టీంలు
- అనుమతులకు ఇ-సువిధ యాప్‌లో దరఖాస్తు
- ప్రత్యేక బృందాలతో నిఘా, విస్తృత తనిఖీలు
- ఫిర్యాదులకు టోల్‌ఫ్రీ నంబర్ 1950
- రామగుండం నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ



మాట్లాడుతున్న నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు, ప్రజలు సహకరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, రామగుండం నియోజకవర్గ ఎన్నికల రిట్నరింగ్ ఆఫీసర్ అరుణశ్రీ కోరారు. రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజవర్గంలోని రామగుండం మున్సిపల్ కార్పొరేషన్, రామగుండం, అంతర్గాం మండలాల పరిధిలో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) నిర్వహణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల కమిషన్ షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరుగుతాయన్నారు. రామగుండం నియోజవర్గంలో మొత్తం 2,14,974 మంది ఓటర్లు ఉండగా, ఇందులో పురుషులు 1,08,233 మంది, మహిళలు 1,06,716 మంది, ట్రాన్స్ జెండర్లు 25 మంది ఉన్నారని, ఇందులో సర్వీస్ ఓటర్లు 215 మంది, 80 ఏళ్లు పైబడిన ఓటర్లు 1373మంది, ఎన్ఆర్ఐలు 19 మంది, దివ్యాంగ ఓటర్లు 2250 మంది ఉన్నారని వివరించారు. 259 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నియోజవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టిక్ సర్వైలెన్స్ టీం, మీడియా సర్వైలెన్స్ టీం, మీడియా వీవింగ్‌తోపాటు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ నిర్వహణకు ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదులను టోల్ ఫ్రీ నంబర్ 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చని, 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా కాల్‌సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇసువిధ యాప్ ద్వారా అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రింటింగ్ ప్రెస్ నిర్వాహకులు తప్పనిసరిగా వారు ప్రచురించే వాటిపై వారిఫోన్ నంబర్, సంస్థ పేరు ముద్రించాలని, లేకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. తనిఖీల కోసం గోదావరి వంతెనపై చెక్ పోస్టులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మీడియా ప్రసారాలు, పెయిడ్ ఆర్టికల్స్, సోషల్ మీడియాపై నిరంతరం నిఘా ఉంటుందన్నారు. ప్రభుత్వ పరిధిలోని ఆస్తులపై 24 గంటల్లో, బహిరంగ ప్రదేశాల్లో 48 గంటల్లో, ప్రైవేట్ ఆస్తులపై ఉన్న ఫ్లెక్సీలు, హోర్డింగ్స్, బ్యానర్లు, వాల్ రైటింగ్‌ను 72 గంటల్లో తొలగిస్తామని రిటర్నింగ్ ఆఫీసర్ వెల్లడించారు. 80 ఏళ్లు పైబడిన ఓటర్లు ఓటు వేసుకోవడానికి ఇంటి దగ్గర లేదా, పోలింగ్ కేంద్రంలో ఓటు వేసుకునేలా ప్రత్యేక ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఎవరైనా ఎక్కువ మొత్తంలో నగదుతో ప్రయాణం చేసినట్లయితే, తగిన ఆధారాలను వెంట ఉంచుకోవాలని, డబ్బుకు తగిన ఆధారాలు లేనిపక్షంలో వాటిని సీజ్ చేస్తామన్నారు. ఆధారాలు సమర్పించిన తర్వాతనే డబ్బును తిరిగి అంజేస్తామని వెల్లడించారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేలా నియోజవర్గ పరిధిలోని తహసీల్దార్లతోపాటు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్లు(ఏఆర్ఓ)గా నియమించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సీహెచ్.నాగేశ్వర్, రామగుండం తహసీల్దార్ కుమారస్వామి, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ విజయ్, మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే కోరుకంటి చందర్ కోరారు. స్థానిక ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో మంగళవారం రాత్రి అసెంబ్లీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతీగడపకు తీసుకెళ్లాలన్నారు. ప్రతీడివిజన్‌లో ప్రజాఅంకితయాత్ర చేపడతామని తెలిపారు. మంత్రి కేటీఆర్ నమ్మకాన్ని వమ్ము చేయకుండా భారీ మెజారిటీ అందించి బహుమతిగా ఇద్దామని అన్నారు. నాయకులు మూల విజయారెడ్డి, పీటీ స్వామి, కౌశిక హరి, తోడేటి శంకర్‌గౌడ్, మాదాసు రాంమూర్తి, జాహిద్ పాషా పాల్గొన్నారు.

చాయ్.. చాయ్..



చాయ్ తయారుచేస్తున్న మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: రంగంపల్లిలోని ఓ టీకొట్టులో మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో భాగంగా ఇలా టీ తయారు చేసి పలువురికి అందించారు.

బీఆర్‌ఎస్‌కే ఓటేయండి

పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడంతోపాటు నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసిన ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డికే ఓటువేసి బీఆర్‌ఎస్‌కు అండగా నిలవాలని మమతారెడ్డి కోరారు. 11 వవార్డులో కౌన్సిలర్ పూదరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సాగిన ప్రచారంలో ఆమె మాట్లాడారు. నాయకులు వైద శ్రీనివాస్, కందుకూరి అనిల్, రాజు, శ్రీధర్, మోబిన్, హైదరవి, ఉప్పు రాజు, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తప్పిదంతోనే కౌలు రైతుదంపతుల ఆత్మహత్య

- మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: నెల్లిపల్లిలో యువ కౌలురైతు దంపతులు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని, ఇది ముమ్మాటికీ ప్రభుత్వ తప్పిదంతోనే జరిగిందని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మృతుల కుటుంబసభ్యులను పరామర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు నియోజకవర్గ ప్రజల పాలిట శాపంగా మారిందన్నారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌తో పంట మునిగి అధిక మొత్తంలో రైతులు నష్టపోతున్నారని పేర్కొన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నిబంధనలు పాటించాల్సిందే..

- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

పెద్దపల్లిరూరల్: ఎన్నికల సంఘం నిబంధనలను అన్ని రాజకీయపార్టీలు పాటించాల్సిందేనని కలెక్టర్, ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం డీసీపీ వైభవ్ గైక్వాడ్, అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్‌తో కలిసి శాసనసభ ఎన్నికల కోసం తీసుకుంటున్న చర్యలపై స మీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు.

3న నోటిఫికేషన్..

శాసనసభ ఎన్నికలకు ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. నవంబర్ 3న నోటిఫికేషన్ జారీచేస్తారని, అదేనెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని, 13 వరకు పరిశీలన, 15 వరకు ఉపసంహరణకు గడువు ఉంటుందన్నారు. నవంబర్ 30న పోలింగ్, డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు ఉంటుందని వివరించారు.

జిల్లాలో 6.94లక్షల మంది ఓటర్లు..

జిల్లాలో మలివిడత ఓటరు జాబితా సవరణ, తుది ఓటరు జాబితా ప్రకారం 6, 94, 612 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ తెలిపారు. ప్రతీఓటరు జాబితాలో తన పేరు సరి చూసుకోవాలన్నారు. ఈనెల 30 వరకు ఓటరుగా పేరు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు.

3 సెగ్మెంట్లు..837 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలోని పెద్దపల్లి, రామగుండం, మంథని అసెంబ్లీ సెగ్మెంట్లలో 837 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ఓటర్ ఇంటి నుంచి రెండు కిలోమీటర్ల లోపే పోలింగ్ కేంద్రాలు ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. అవసరమైనన్ని బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, వివి ప్యాట్లు అందుబాటులో ఉన్నాయన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఎన్నికల నియమావళికి విరుద్ధంగా ఓటర్లను ప్రలోభపెట్టినా, బెదిరించినా.. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగాలు చేసినా, తప్పుడు ప్రచారాలకు పాల్పడ్డా చట్టప్రకారం చర్యలుంటాయని కలెక్టర్ పేర్కొన్నారు. రాజకీయపార్టీలు, నాయకులకు ఎన్నికల ప్రచారం కోసం సులభంగా అనుమతులు జారీచేస్తామన్నారు. ముందు ఎవరు దరఖాస్తు చేసుకుంటే వారికే అనుమతి ఉంటుందన్నారు. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు వాడొద్దని సూచించారు.

ప్రత్యేక నిఘాబృందాలు..

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనపై వచ్చే ఫిర్యాదులను పరిష్కరించేందుకు జిల్లాలో 10 సర్వేలైన్స్, 10 ఫ్లయింగ్‌స్క్వాడ్స్, 5 వీడియో సర్వే లైన్సు బృందాలను ఏర్పాటు చేశామని కలెక్టర్ పేర్కొన్నారు. ఎన్నికల ఫిర్యాదులను 1950 టోల్ ఫ్రీ నంబర్, సి విజల్ యాప్ ద్వారా చేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన 100 నిమిషాల్లోపు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని చర్యలు తీసుకుంటారని వివరించారు. కరపత్రాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ యజమానులు ఫోన్ నంబర్, పేరు ముద్రించాలన్నారు.

నాలుగు చెక్‌పోస్టుల ఏర్పాటు..

జిల్లాలో పోలీసు నిఘా తీవ్రతరం చేశామని డీసీపీ వైభవ్‌గైక్వాడ్ తెలిపారు. ఆధారాల్లేకుండా నగదు త రలించినా, లిక్కర్ రవాణా చేసినా చర్యలు తప్పవన్నారు. అక్రమ రవాణాను అడ్డుకునేందుకు జిల్లాలో నాలుగు చెక్ పోస్టులు(సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి, ఓదెల మండలం గుంపుల, మంథని మండలం ఎగ్లాస్‌పూర్, గోదావరిఖనిలో) ఏర్పాటు చేశామన్నారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లను బైండోవర్ చేస్తున్నామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా ఉంచి ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. సీ సెక్షన్ సూపరింటెండెంట్ ప్రకాశ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

ఆటో అదుపుతప్పి పలువురికి గాయాలు

మంథని: ఎక్లాస్‌పూర్ శివారు గాడుదులగండి ఘాట్ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడిన ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. కాటారం మండలం గోపాలపురం గ్రామానికి చెందిన జనగామ సాంబయ్య తన కుటుంబం వేములవాడతోపాటు ఇతర దైవక్షేత్రాల దర్శనం ముగించుకొని ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో రోడ్డుపైకి గేదెలు అడ్డు రావడంతో తప్పించబోయి ఆటో బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. కాగా ఆటో ఉన్న లక్ష్మికి తల, ఇతర శరీర భాగాల్లో బలమైన గాయం కావడంతో కరీంనగర్ తరలించారు. అందులో ప్రయాణిస్తున్న మరోఆరుగురు స్వల్పంగా గాయపడ్డారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

సుల్తానాబాద్‌రూరల్: అంగన్‌వాడీలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించాలని జిల్లా సంక్షేమ అధికారి, ప్రాజెక్టు డైరెక్టర్ రౌఫ్‌ఖాన్ సూచించారు. చిన్నకల్వల గ్రామంలోని రైతువేదికలో మంగళవారం అంగన్‌వాడీ టీచర్ల ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీడీపీవో కవిత, పోషణ అభియాన్ కో ఆర్డినేటర్ అనిల్, అరుణ, సంధ్య పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి మృతి

ఓదెల(పెద్దపల్లి): కాజీపేట - బల్లార్షా సెక్షన్లలోని పొత్కపల్లి -బిజిగిరిషరీఫ్ రైల్వేస్టేషన్ల మధ్య ఓ వ్యక్తి(45) సంపర్క్‌క్రాంతి ఎక్స్‌ప్రెస్ రైలుకిందపడి సోమవారం రాత్రి ఆత్మహత్య చేసుకున్నాడని రామగుండం జీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. రైలు ఢీకొనడడంతో శరీరం ముక్కలై గుర్తుపట్టరాకుండా ఉందన్నారు. నలుపు రంగు ప్యాంటు ధరించాడని, గుర్తింపు కార్డులు ఏమీ లభించలేదన్నారు. మృతదేహాన్ని గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. వివరాలకు సెల్ నంబరు 99493 04574, 87126 58604లో సంప్రదించాలని కోరారు.

తప్పిన పెనుప్రమాదం

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద రాజీవ్ రహదారిపై మంగళవారం వేకువజామున జరిగిన ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. గోదావరిఖనికి చెందిన శ్రీనివాస్ హైదరాబాద్ నుంచి తన కారులో మరో ముగ్గురితో కలిసి గోదావరిఖనికి వస్తున్నారు. ఈక్రమంలో ఎఫ్‌సీఐ క్రాస్ రోడ్డు వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని, ఆ తర్వాత సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ స్థంభాన్ని ఢీకొంది. ఈ క్రమంలో ఎయిర్ బ్యాగులు ఓపెన్ కావడంతో ప్రమాదం తప్పింది. ఆ సమయంలో కారు రివర్స్ గేర్‌లో రోడ్డు పక్కన ఉన్న ఓ వైన్‌షాపు వరండాలోకి వెళ్లి గోడను ఢీకొని నిలిచిపోయింది. గాయపడిన వారిని గోదావరిఖని ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలిలించారు. ప్రమాదంలో గాయపడిన ఓ మహిళను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. వైన్‌షాపు వరండాలోని కారును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

'నిర్లక్ష్యం చేస్తున్నారు'

ఎలిగేడు(పెద్దపల్లి): వాల్మీకి బోయలను రాజకీయ పార్టీలు ముప్పయి ఏళ్లుగా మోసం చేస్తూనే ఉన్నాయని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుడుగుల మహేందర్ విమర్శించారు. స్థానిక వాల్మీకిబోయ సంఘం కమ్యూనిటీహాల్‌లో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలోనే వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చుతామని హామీలు ఇస్తున్న నాయకులు.. ఆ తర్వాత పట్టించుకోవడం లేదని ధ్వజమెత్తారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి తమ సామాజిక వర్గాన్ని ఏకతాటిపైకి తీసుకొచ్చి ఓటు ఆయుధంతో రాజకీయ పార్టీలకు తగిన జవాబు చెబుతామని ఆయన హెచ్చరించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

యైటింక్లయిన్‌కాలనీ: వివిధ విభాగాల్లో పనిచేస్తున్న దాదాపు 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు సంస్థ సాధించిన లాభాల్లో కొంత వాటా చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్జీ-2 ఏరియా హౌస్ కీపింగ్, వర్క్‌షాప్ కాంట్రాక్ట్ కార్మికులతో కలిసి నాయకులు మంగళవారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

బొగ్గుబాయి వార్తలు

ఆపద సమయాల్లో అండగా నిలుస్తున్న రెస్క్యూ



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు



హాజరైన ఏరియాల జట్లు

- డీఎంఎస్ ఉమేశ్ ఎం.సావర్కర్
- అట్టహాసంగా ప్రారంభమైన సింగరేణి జోనల్ పోటీలు

గోదావరిఖని: ఆపద సమయాల్లో రెస్క్యూ అండగా నిలుస్తోందని డీఎంఎస్ ఉమేశ్ ఎం. సావర్కర్, సింగరేణి డైరెక్టర్లు ఎన్‌వీకే శ్రీనివాస్, వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం సింగరేణి మెయిన్ రెస్క్యూ స్టేషన్‌లో 52వ జోనల్ మైన్స్ రెస్క్యూ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఇటీవల ఏఎల్‌పీ గనిలో జరిగిన ప్రమాదంలో బొగ్గు కుప్పల్లో కూరుకపోయిన కార్మికున్ని రక్షించి రెస్క్యూ బ్రిగేడియర్లు ఈప్రాంతానికి హీరోలుగా నిలిచారని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లోనూ ముందుకు సాగాలని సూచించారు. ఏటా వృత్తి నైపుణ్యం పెంచుకుంటూ మారుతున్న కాలానికి అనుగుణంగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఎంవోఏఐ అధ్యక్షుడు జక్కం రమేశ్, కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య, ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, రెస్క్యూ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్, ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు, ఏఎల్‌పీ జీఎం వెంకటేశ్వర్లు, భూపాల్‌పల్లి సేఫ్టీ జీఎం గుప్తా, ఆర్జీ సేఫ్టీ సాంబయ్య, ఎస్‌వోటూ జీఎం అబ్దుల్‌సలీం, రెస్క్యూ సూపరింటెండెంట్ మాధవరావుతో పాటు అన్నికార్మిక సంఘాల నాయకులు అన్ని ఏ రియాల నుంచి వచ్చిన రెస్క్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీనియారిటీ ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలి

- మైనింగ్ స్టాఫ్ కో కన్వీనర్ సాంబయ్య



మాట్లాడుతున్న నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న మైనింగ్ సిబ్బందితోపాటు అన్ని డిపార్ట్‌మెంట్లలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు సీనియారిటీ, అర్హత ప్రకారంగా ప్రమోషన్లను ఇవ్వాలని మైనింగ్ స్టాఫ్ కో కన్వీనర్ నాగెల్లి సాంబయ్య డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రెస్ భవన్‌లో ఆయన మాట్లాడారు. అన్‌ఫిట్ అయిన మైనింగ్ సిబ్బందికి సర్ఫేస్‌లో సూటబుల్ ఉద్యోగం ఇవ్వాలని చేస్తున్న పోరాటానికి సింగరేణి యాజమాన్యం స్పందించి ఈనెల 7న సర్క్యులర్ జారీ చేసిందన్నారు. భవిష్యత్ తరాలకు కూడా ఉపయోగపడేలా రాబోయే వారికి పూర్తిస్థాయిలో దీనిని అమలు చేయాలని కోరారు. వివిధ కేటగిరీల్లోని ఇంటర్నల్ ఉద్యోగలకు కోల్ ఇండియా తరహాలో పదోన్నతి కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో ఆర్జీ-2 మైనింగ్ స్టాఫ్ వైస్ ప్రెసిడెంట్ బానయ్య, నాయకులు వెంకటస్వామి, రమేశ్, రవీందర్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, మోహన్‌రెడ్డి, రమేశ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలి

- సంస్థ డైరెక్టర్ ఎన్వీకే శ్రీనివాస్



మ్యాప్ పరిశీలిస్తున్న డైరెక్టర్ శ్రీనివాస్

గోదావరిఖని:వర్షాలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో బొగ్గు ఉత్పత్తి పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సింగరేణి డైరెక్టర్ ఎన్‌వీకే శ్రీనివాస్ సూచించారు. మంగళవారం ఓసీపీ-3 ప్రాజెక్టును సందర్శించి ఉత్పత్తి, ఉత్పాదకత తీరు గురించి ఉద్యోగులను అడిగి తెలుసుకున్నారు. వ్యూపాయింట్ నుంచి సర్వేమ్యాప్ ద్వారా పనిస్థలాలను పరిశీలించారు. గనికి కేటాయించిన లక్ష్యాలు, అందుకు చేపట్టవలసిన ప్రణాళికలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. అనంతరం డ్రాగ్‌లైన్ వద్ద పనిస్థలాలను పరిశీలించి ఆఫ్ లోడింగ్ వేగవంతంగా నిర్దేశించిన లక్ష్యాలను సాధించేలా అధికారులకు దిశానిర్దేశం చేశారు. యంత్రాల పూర్తిగంటలు వినియోగిస్తూ, రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. ఆర్జీ-2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ఏరియా ఇంజినీర్ నర్సింహారావు, ప్రాజెక్టు మేనేజర్ రమేశ్, సర్వే అధికారి నర్సింగరావు, డ్రాగ్ లైన్ ఇన్‌చార్జి విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

ట్రేడ్స్‌మెన్‌కు సూటబుల్ జాబ్ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న నాయకులు

గోదావరిఖని: సింగరేణి అండర్‌గ్రౌండ్‌లో పనిచేస్తున్న మైనింగ్‌స్టాఫ్, ట్రేడ్స్‌మెన్, ఈ అండ్ ఎం సూపర్‌వైజర్లు, ఓసీపీల్లో పనిచేస్తున్న ఈపీ ఆపరేటర్లు అనారోగ్యంతో మెడికల్ అన్ ఫిట్ అయితే సర్ఫేస్‌లో సేమ్ జాబ్ ఇవ్వాలని నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్జీ-1 జీఎం ఆఫీస్ ఎదుట ధర్నా నిర్వహించారు. దీనిపై గతంలో సమ్మె నోటీసు ఇస్తే 2022 ఏప్రిల్ 19న యూనియన్లతో ఒప్పందం చేసుకొని 60 రోజుల్లో కమిటీని వేసి నిర్ణయం తీసుకుంటామని సింగరేణి చెప్పిందన్నారు. అయితే, ఆరు నెలల నుంచి ఎటువంటి నిర్ణయం తీసుకోకుండా హడావుడిగా ఈనెల 7న సర్క్యులర్ విడుదల చేసిందన్నారు. ట్రేడ్స్‌మెన్స్, మైనింగ్ స్టాఫ్‌ను మోసం చేసేలా సర్క్యులర్ ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.స్వామి, ఆరెల్లి పోశం, మహేశ్, వెంకట్‌రెడ్డి, దొంత సాయన్న, శనిగల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'సింగరేణి తీరు సరికాదు'



వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రామగిరి: సింగరేణి యాజమాన్యం మైనింగ్ స్టాఫ్, సూపర్‌వైజర్‌లకు వన్ టైం సెటిల్మెంట్ చేయడం, ఈపీ ఆపరేటర్, టెకీనషియన్‌లను పక్కన పెట్టడం సరికాదని ఏఐటీయూసీ సెంట్రల్ బ్రాంచ్ సెక్రటరీ జూపాక రాంచంద్రం, ఆర్జీ-3 బ్రాంచ్ సెక్రటరీ ఎంఆర్‌సీ రెడ్డి అన్నారు. మంగళవారం ఓసీపీ-2, ఏపీఏ ఏరియాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. యాజమాన్యం ఇచ్చిన సర్క్యులర్‌ను ఉపసంహరించుకుని మైనింగ్‌స్టాఫ్, సూపర్ వైజర్, ఈపీ ఆపరేటర్, టెక్నీషియన్‌లకు వన్ టైం సెటిల్‌మెంట్ కాకుండా నిరంతరం తగిన ఉద్యోగాలు కేటాయించాలని అన్నారు. ఫిట్ కార్యదర్శి మల్రి రాజు, ఏపీఏ ఫిట్ కార్యదర్శి గంగాధర్, అసిస్టెంట్ సెక్రటరీ కుమార్, బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ రవి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపుపై కార్మిక శాఖ మరో ముందడుగు

- నామినేషన్ల పరిశీలన ప్రక్రియ పూర్తి
- 14యూనియన్లలో ఒక యూనియన్‌పై అనర్హత
- 13యూనియన్లకు గుర్తుల కేటాయింపు

గోదావరిఖని: గుర్తింపుపై కార్మికశాఖ మరో అడుగు ముందడుగు వేసింది. ఈనెల 6, 7వ తేదీల్లో నామినేషన్లను స్వీకరించిన డిప్యూటీ సీఎల్‌సీ శ్రీనివాసులు.. మంగళవారం నామినేషన్ల పరిశీలన పూర్తిచేశారు. 14యూనియన్లు నామినేషన్లు వేయగా అందులో తెలంగాణ రీజినల్ సింగరేణి కార్మిక సంఘం రిజిస్ట్రేషన్ ఒరిజినల్ సర్టిఫికెట్ సమర్పించకపోవడంతో దానిపై అనర్హత వేటువేశారు. దీంతో 13సంఘాలు బరిలో నిలిచాయి. వీటన్నిటికీ కార్మిక శాఖ గుర్తులు కేటాచించింది. కొన్నియూనియన్లు గుర్తులను మార్చుకోగా మరికొన్ని గత గుర్తులపైనే పోటీ చేస్తామని స్పష్టం చేశాయి. దీంతో గుర్తుల కేటాయింపు ప్రక్రియ పూర్తయ్యింది. సింగరేణి గత గుర్తింపు సంఘం టీబీజీకేఎస్, జాతీయ కార్మిక సంఘాలతో పాటు మరో ఏడు సంఘాల నాయకులు డిప్యూటీ సీఎల్‌సీ ఎదుట మంగళవారం హాజరయ్యారు.

యాజమాన్యం ప్రమేయం లేకుండానే..

సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, బడ్జెట్, ఏర్పాట్లు చూసే సింగరేణి యాజమాన్యం ఈప్రక్రియకు పూర్తిగాదూరంగా ఉంది. అయితే హైకోర్టు ఉత్తర్వుల మేరకు ముందుకు వెళ్తామని డిప్యూటీ సీఎల్‌సీ చెబుతున్నా.. యాజమాన్యం సహకరించకపోతే ఎన్నికలు నిర్వహించడం సాధ్యమేనా? అనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. అంతే కాకుండా రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో గుర్తింపుపై అనుమాలు మొదలైయ్యాయి. ఏదిఏమైనా ఈనెల 11న హైకోర్టు ఫుల్ బెంచ్ ఇచ్చే తీర్పు కీలకం కానుంది.

నూతన కార్యవర్గం ఏర్పాటు

గోదావరిఖని: జిల్లా కాంగ్రెస్ కమిటీని డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్ రాజ్‌ఠాగూర్ ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా నూకల బానయ్య(మంథని), తోట చంద్రయ్య(రామగిరి), మారెల్లి రాజిరెడ్డి(యైటింక్లయిన్ కాలనీ), గాగిళ్ల తిరుపతిరెడ్డి(ధర్మారం), కట్కూరి సుధాకర్‌రెడ్డి(పెద్దపల్లి), ఎండీ మునీర్(కాల్వశ్రీ రాంపూర్), ప్రధాన కార్యదర్శులుగా జనగామ నర్సింగరావు(మంథని), సూర సమ్మయ్య(పాలకుర్తి), పాతశెట్టి రవి(పాలకుర్తి), పూదరి సత్తయ్యగౌడ్(అంతర్గాం), దాసరి సాంబమూర్తి(గోదావరిఖని), బందం అజయ్‌పాల్‌రెడ్డి(ధర్మారం), గందు సంజీవ్(జూలపల్లి), బూతగడ్డల సంపత్(పెద్దపల్లి), బైరి రవిగౌడ్(ఓదెల), నాయిని ఓదెలు(గోదావరిఖని), కార్యదర్శులుగా అనుమ సత్యనారాయణ(గోదావరిఖని), మహంకాళి అంజయ్య(వడ్కాపూర్), ఎండీ రహీం(ఎన్టీపీసీ), అరిగె లింగారెడ్డి(ధర్మారం), ఎ. వెంకటేశ్వర్‌రావు(ఎలిగేడు), మీస సత్యనారాయణ(సుల్తానాబాద్), అమిరిశెట్టి రాయలింగు(సుల్తానాబాద్), కోల నర్సాగౌడ్(కమాన్‌పూర్), అఫీషియల్ స్పోక్స్‌మెన్‌గా ఉరిమెట్ల రాయలింగం(అంతర్గాం), చుక్కల శ్రీనివాస్(గోదావరిఖని), గోసిక రాజేశం(ఓదెల)ను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేశారు.